


# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఫిబ్రవరి 17, 2026 | సంపుటి : 2 | సంచిక : 131 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## పౌరసేవల తీరు ప్రశంశనీయం

» డేటా సంరక్షణ తదితర అంశాలపై ఆరా
» ఆర్టీజీఎస్‌ను బాబుతో కలసి సందర్శించిన గేట్
» టెక్నాలజీ ఆధారిత సేవలపై బాబు వివరణ
» ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు బాగున్నాయని ప్రశంసలు



**అమరావతి,ఫిబ్రవరి16 :** డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన గేట్స్ చంద్రబాబును ప్రశసించారు. రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా.. 'గ్రేట్ వర్క్' అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్‌గేట్స్ తెలుసుకున్నారు. ఆర్టీజీఎస్‌లోని డిస్‌ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ కితాబిచ్చారు.

మిగతాద్ది 2 లో

## నేటినుంచి హైటెక్స్ వేదికగా
# బయో ఏషియా సదస్సు

» రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
» సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి



2 లో

**హైదరాబాద్,ఫిబ్రవరి16 :** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, అమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

## పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

» ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు
» రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ది
» మధిరలో మీడియాతో డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,ఫిబ్రవరి16 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.



మిగతాది 2లో



## మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

▪ ఫలితాలపై బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు విశ్లేషణ

**హైదరాబాద్,ఫిబ్రవరి16 :** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు.

2లో..



## బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

▪ పలు రంగాల్లో ఆయనతో చర్చిస్తున్నాం
▪ ఎక్స్ వేదికగా ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,ఫిబ్రవరి16 :** గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు.

» మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక
» డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక
» బిజెపికి లాభించిన బిఆర్ఎస్ తటస్థ వైఖరి




2 లో

## కరీంనగర్‌పై బిజెపి జెండా

**కరీంనగర్,ఫిబ్రవరి16 :** తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి.

## మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక..
### 84 చోట్ల కాంగ్రెస్.. 17 స్థానాల్లో బీఆర్ఎస్

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మరో 11 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. 17 బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. ఒక స్థానంలో భాజపా విజయం సాధించింది.



2లో..

## ఇక శరవేగంగా నిజామాబాద్ అభివృద్ది

» ప్రత్యేక నిధులతో ప్రాధాన్యం ఇస్తామన్న మంత్రి ఉత్తమ్



**నిజామాబాద్,ఫిబ్రవరి16 :** నిజామాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అందుకోసం నిధులు ప్రత్యేక కేటాయించనున్నట్లు చెప్పారు. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రహదారులు, అభివృద్ధి విషయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వబోతోందని చెప్పారు. తెలంగాణలో నిజామాబాద్ ఓ గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కృషి చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

మిగతాది 2లో



## పార్టీలో కొనసాగాలా?..
### జీవన్‌రెడ్డి సంచలన కామెంట్స్

**జగిత్యాల:** కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మరోసారి తన పార్టీపై అసహనం వ్యక్తం చేశారు. జగిత్యాలలో కాంగ్రెస్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గెలుపుపై విచారం వ్యక్తం చేశారు. ఛైర్మన్ స్థానం దక్కినందుకు సంతోష పడలా లేక బాధ పడాలా అర్థం కావడం లేదన్నారు. సమిండ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి ఎమ్మెల్యే సంజయ్ ని కలిసిన కొద్ది రోజుల్లోనే ఛైర్‌పర్సన్ పదవిలో కూర్చోవడమేంటని విచారం వ్యక్తం చేశారు..?



## బిల్గేట్స్ పర్యటనతో ఎపికి పెరిగిన ప్రాధాన్యత

» బిల్‌గేట్స్‌కు..స్వాగతం పలకడం ఆనందంగా ఉంది
» ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,ఫిబ్రవరి16 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

2లో..




## తొర్రూరులో ఇరు వర్గాల బాహాబాహీ

» పరస్పర నినాదాలతో స్వల్ప ఉద్రిక్తత
» బిఆర్ఎస్ ఆధిక్యాన్ని దెబ్బతీసిన ఎక్స్ అఫీషియో
» ఎర్రబెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
» రగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన ఎస్పీ

2 లో

**మహబూబాబాద్,ఫిబ్రవరి16** తెలంగాణలో మేయర్లు, డిప్యూటీ మేయర్‌లు, మున్సిపల్ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక పక్రియ కొనసాగుతున్న వేళ పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నిక సజావుగా సాగుతోంది. కానీ హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకుపైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు, ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చినా ఎక్స్అఫిషియో మెంబర్ల ఓట్లతో బలాలు సమానం అయ్యాయి.

# కరీంనగర్‌పై బిజెపి జెండా

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. బీఆర్ఎస్ ఎటువైపు మొగ్గు చూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది.ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్ఎస్ 9 స్థానాలు, స్వతంత్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.

## బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

మొదటిపేజీ తరువాయి
గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

## పౌరసేవల తీరు ప్రశంశనీయం

మొదటిపేజీ తరువాయి
అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు గేట్స్‌కు సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరునూ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్‌గేట్స్ ప్రశ్నించగా.. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి కూడా ఈ సందర్భంగా బిల్‌గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ లాంటి పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ 'నైస్' అంటూ కొనియాడారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్‌స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం వివరించారు. అందుకు బిల్‌గేట్స్ 'గ్రేట్' అంటూ కితాబిచ్చారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్‌గేట్స్ అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణ తీరును బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించగా.. గ్రేట్ వర్క్ అంటూ కొనియాడారు.

## బిల్గేట్స్ పర్యటనతో ఎపికి పె?రిగిన ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడు తుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
లభించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

మొదటిపేజీ తరువాయి
గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

మొదటిపేజీ తరువాయి
రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన
కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నేటినుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

మొదటిపేజీ తరువాయి
రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

## జెఇఇ మెయిన్ ఫలితాల విడుదల

**-వందశాతంతో సత్తా చాటిన ముగ్గురు తెలుగు విద్యార్థులు**

దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) పేపర్-1 ఫలితాలు వచ్చేశాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒక విద్యార్థి 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలను తర్వాత ప్రకటించనున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 మంది (96.26?) హాజరయ్యారు. ఈ ఫలితాల్లో మొత్తంగా 12మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణ నుంచి వివాన్ శరద్ మహిశ్వరి ఉన్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

## గందరగోళంగా మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక

- మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం
- ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా
- హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం
- ఎక్స్ అఫీషియో సభ్యులల బలంతో కాంగ్రెస్ పైచేయి
- ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్
- కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటన
- కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి
- కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎన్నికలో తీవ్ర గందరగోళం నడిచింది. పలుచోట్ల ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక సీట్లు సాధించినా కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పలు మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాల్లో గందరగోళం వల్ల ఎన్నికను వాయిదా వేశారు. ఇకపోతే అధికార కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్లా ఆధిక్యం ప్రదర్శించింది. హంగ్ ఏర్పడిన చోట్ల పైచేయి సాధించింది. సిఎం రేంవత్ ఆదేశాలతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా వేసింది. హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం ఫలితాన్ని సాధించింది. ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముత్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెలిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి.

# మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక..
## 84 చోట్ల కాంగ్రెస్.. 17 స్థానాల్లో బీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి
మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాల సమయానికి 90 స్థానాల్లో వివిధ పార్టీలు స్పష్టమైన మెజార్టీ కనబరచగా.. 36 స్థానాల్లో హంగ్ పరిస్థితి ఏర్పడింది. కాగా, వివిధ పార్టీల మధ్య పొత్తులు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కొన్ని మున్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్లు ఎన్నికయ్యారు.

## తొర్రూరులో ఇరు వర్గాల బాహాబాహీ

మొదటిపేజీ తరువాయి
దాంతో ఇక్కడ డ్రా తీసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు భారీ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. ఫలితంగా పరిస్థితి ఉద్రిక్తమై రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యాలయానికి చేరుకోగా.. ఎర్రబెల్లి పీఏపై కొంతమంది కాంగ్రెస్ కార్తకర్తలు దాడికి పాల్పడ్డారు. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్ మద్దతుదారులు కావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాలు సమానంగా మారాయి. దాంతో డ్రా ద్వారా ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదిలావుంటే వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆ పార్టీ చెబుతోంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తొర్రూరులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాగా.. అధికారులు అడ్డుకున్నారు. రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న ప్రాంతంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఆయనను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు వేసేందుకు అనుమతించ లేదు. దాంతో ఆయన ఈ అంశంపై కోర్టుకు వెళ్తానని చెప్పారు. దీంతో మున్సిపల్ ఛైర్మెన్ ఎన్నికల వేళ తొర్రూరులో హైటెన్షన్ నెలకొంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణుల వ్యతిరేక నినాదాలతో మున్సిపల్ ఆఫీసు ప్రాంగణం హోరెత్తుతోంది.భారీ జనసమీకరణకు ప్లాన్ చేసింది బీఆర్ఎస్. ఈ క్రమంలో మున్సిపల్ ఆఫీసు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఇరు వర్గాలు వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసులను సైతం తోసుకుంటూ మున్సిపల్ ఆఫీసు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి అదుపు తప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఎవ్వరు కూడా అక్కడ ఉండకుండా వెనక్కి పంపించారు. అక్కడే ఉంటే లాఠీ చేయాల్సి వస్తుందని కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలను హెచ్చరించారు. అలాగే అక్కడికి వచ్చిన యశశ్విని రెడ్డి అత్త ఝాన్సీరెడ్డిని కూడా ఎస్పీ వెన్నక్కి పంపించారు. ఆమె కారు దిగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మాత్రం మున్సిపల్ ఆఫీసుకు అనుమతించారు.

## ఇక శరవేగంగా నిజామాబాద్ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి
నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడం అభివృద్ధికి సంకేతమని అన్నారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 17, ఎంఐఎం 14, బీఆర్ఎస్ పార్టీ 1 గెలుచుకున్నాయి. నగర మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎంఐఎంను తమ దారికి తెచ్చుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఒక అభ్యర్థి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాంతో నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. దాంతో నగర మేయర్‌గా ఉమారాణి పేరును ఖరారు చేశారు. అయితే బీజేపీని ఓడించేందుకు బీఅర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని ఎంపి ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు.

## పార్టీలో కొనసాగాలా?.. జీవన్‌రెడ్డి సంచలన కామెంట్స్

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికి ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని మొదటి నుంచీ తాను మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎమ్మెల్యే నాయకత్వంలోనే పని చేస్తే ఇంకా తాను కాంగ్రెస్‌లో కొనసాగాలా అని ప్రశ్నించారు. జెండా మోసిన కార్యకర్తల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పేరుతో పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం ఎందుకని ఎమ్మెల్యేను సంజయ్‌ను ప్రశ్నించారు.
కాంగ్రెస్‌లో అన్యాయం జరిగిన వారికే తాను మద్దతు ఇచ్చానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంత కాలం తమ వర్గంపై ఈ వేధింపులు కొనసాగుతాయని ఆరోపించారు.ఇన్ని అవమానాలు భరిస్తూ కాంగ్రెస్‌లో కొనసాగడంపై ఆలోచించే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో కొనసాగాలా, వద్దా అన్న సందిగ్ధ పరిస్థితి తనకు నెలకొందని జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.
జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా ఛైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీకి, ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకున్నాయికాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు.
స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు. ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు. దీంతో జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

## కామారెడ్డి ఛైర్‌పర్సన్‌గా ఇప్ప ఉమారాణి

కామారెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన ఇప్ప ఉమారాణిని చైర్ పర్సన్ పీఠం వరించింది. ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్ప ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేది లేదంటూ కామారెడ్డిలోని బీఆర్ఎస్ పార్టీ నేతలు తేల్చి చెప్పారు. దాంతో తాజాగా పార్టీలో చేరిన ఇప్ప ఉమారాణి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించింది. మరోవైపు వైస్ చైర్మన్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ నేతలు కోరారు. కాసర్ల గోదావరి వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఫిబ్రవరి 17, 2026

# జగిత్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడిపై దాడి.

## ▪తమ అధ్యక్షుడిని ఉరికించి కొట్టిన బిజెపి కార్యకర్తలు

**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు రాచకొండ యాదగిరి ఇంటిపై బీజేపీ కార్యకర్తలు సోమవారం దాడి చేశారు. మున్సిపల్ పాలకవర్గం కొలువుదీరిన అనంతరం మెట్‌పల్లి పట్టణంలోని యాదగిరి ఇంటికి చేరుకున్న కార్యకర్తలు ఇంటిలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మెట్టుపల్లి మున్సిపాలిటీలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అత్యధిక స్థానాలు గెలుచుకున్న బిజెపి కౌన్సిలర్లకు ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా విప్ జారీ చేశారని కార్యకర్తలు బాధతో రగిలిపోయారు. ఆలస్యంగా జారీ చేయడం వల్ల గందరగోళం ఏర్పడిందని పార్టీకి తమకు అన్యాయం జరిగిందని కౌన్సిలర్లు భావించారు. మెట్టుపల్లి లోని బిజెపి కార్యకర్తలు తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇంటికి వెళ్లి బీభత్సం సృష్టించారు.

▪ **ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసం చేసి, తమ పార్టీ జిల్లా అధ్యక్షుడిని లాగుతూ ఉరికించి కొట్టారు**





ఈ సంఘటన మెట్టుపల్లి లోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
జగిత్యాల్ జిల్లాలో మునిసిపల్ ఎన్నికల్లో ఆశావహుల పట్ల, పనిచేసే సీనియర్ కార్యకర్తల పట్ల పక్షపాత ధోరణితో నిర్లక్ష్యం వహించారని వరసగా కథనాలు వెలువబడ్డాయి.
నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మునిసిపాలిటీలలో ఎంపీ ధర్మపురి అరవింద్ గారు నియంత ధోరణితో వ్యవహరించారని కార్యకర్తలు బహిరంగంగా విమర్శించడం కూడా జరిగింది.
జగిత్యాలలో సంక్షోభ సమయములో, నక్సలైట్ల దాడులతో కష్ట నష్టాలకు గురైన కార్యకర్తలను కాదని ఎంపీ అరవింద్ గారు తన ఇష్టారాజ్యంగా అభ్యర్థులను ఎన్నిక చేసారని, నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని జగిత్యాలకు చెందిన సీనియర్ నాయకుడు ఏసీఎస్ రాజు శ్రీమతి లక్ష్మి గారల కొడుకు ప్రజోత్ మీడియా ముందు కన్నీళ్ళతో విలపించిన వీడియోలు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించాయి.
ఎంపీ అరవింద్ గారి అనుచరులు మాత్రమే కార్యకర్తలుగా గుర్తించబడుతున్నారని విమర్శలు బలంగా వినిపించాయి.
పార్టీ కార్యకర్తలతో తనకు సంబంధం లేదు, తనకు విశ్వసనీయులే పార్టీ కార్యకర్తలనే వైఖరితో ఎంపీ అరవింద్ ఎవ్వరిని లెక్క చేయడం లేదని బిజెపి కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.
టికెట్ల కేటాయింపులో పార్టీకి సంబంధం లేని వ్యక్తుల చేతిలో బీఫారాలు పెట్టి, బిజెపి జిల్లా అధ్యక్షుడిని ఒక పనిముట్టుగా వాడుకున్నారని కార్యకర్తలు అసహనంతో ఆవేశంతో రగిలిపోయారు.
జగిత్యాలలో బిజెపి పార్టీ టికెట్లు రాని అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా పోటీ చేశారు. ఇద్దరు ముగ్గురు బిజెపి రెబల్ కార్యకర్తలు కౌన్సిలర్లుగా కూడా గెలిచారు.
కోరుట్లలో కూడా టికెట్ల పంపిణీలో అసహజ ధోరణి కనిపించిందని బహిరంగ చర్చ జరిగింది. రాజకీయాలలో గెస్ట్ గా కనిపించే స్థానిక డాక్టర్ ఒకరికి పార్టీ సర్వాధికారాలు అప్పగించారని కార్యకర్తలు లో లోపల రగిలిపోయారు. అన్ని పార్టీల్లో కనిపించే ఆ డాక్టర్ గారి దగ్గరికి వెళ్లి టికెట్లు అడుక్కునే దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని కోరుట్ల బిజెపి కార్యకర్తలు తీవ్రంగా బాధపడ్డారు. బిజెపి పార్టీకి ఆ గెస్ట్ డాక్టర్ కు సంబంధం ఏమిటని ప్రజలు కూడా ముక్కున వేలేసుకున్నారు.

▪ **మెట్టుపల్లి లో మొదటి నుండి బిజెపి బలమైన పార్టీ. సమన్వయంతో సహనంతో పరస్పర సహకారంతో గనుక అభ్యర్థుల ఎంపిక జరిగి ఉంటే మెట్టుపల్లిలో సంపూర్ణమైన మెజారిటీ వచ్చేదని ప్రజలు కార్యకర్తలు భావిస్తున్నారు**

▪ **మెట్టుపల్లి మునిసిపల్ ఎన్నికలలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బిజెపి పది స్థానాలు గెలిచిందని, సరిగ్గా సమిష్టి కృషి చేసి ఉంటే మెట్టుపల్లి మునిసిపాలిటీ బిజెపి ఖాతాలో పడేదని ప్రజల్లో చర్చ జరుగుతున్నది**

మెట్టుపల్లి మునిసిపల్ చైర్మన్ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్నప్పటికీ బిజెపి జిల్లా అధ్యక్షుడి స్థానిక పట్టణమైన మెట్టుపల్లిలో కౌన్సిలర్లకు సకాలంలో విప్ జారీ చేయకపోవడం వల్ల గందరగోళం చెలరేగిందని కార్యకర్తలు ఆవేశంతో రగిలిపోయారు. ఈ మొత్తం వ్యవహారంలో మెట్టుపల్లి సీనియర్ బిజెపి నాయకుడు అయినటువంటి శ్రీ సుఖేందర్ గారి సతీమణి శ్రీమతి మీనా గారు క్రాస్ ఓటింగ్ చేశారని జిల్లా అధ్యక్షుడి పేరుపైన పార్టీ అధిష్టానానికి పంపిన లేక బహిరంగంగా వెలువడింది. 26 స్థానాలు ఉన్న మెట్టుపల్లి మున్సిపాలిటీలో మెజారిటీకి 5 స్థానాలు తగ్గినాయి. నలుగురు ఇండిపెండెంట్ ల సహకారం తీసుకొని స్థానిక బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే ప్రాపకంతో లేదా సహకారంతో మునిసిపల్ పీఠం దక్కించుకునే సువర్ణ అవకాశాన్ని కావాలని చేజార్చిన బిజెపి జిల్లా అధ్యక్షుడు యాదగిరి ని ప్రత్యక్ష కారణంగా కార్యకర్తలు భావించారు.

▪ **కరీంనగర్ ఎంపీ కేంద్రమంత్రి అయిన బండి సంజయ్ మాదిరిగా రాజకీయ చతురతతో వ్యవహరించి ఉంటే నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కొన్ని మునిసిపాలిటీలు బిజెపి చేతికి వచ్చేవని ఇప్పుడు సర్వత్ర చర్చ జరుగుతున్నది**

నిజామాబాద్ కార్పొరేషన్ పై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ గారు తన నియోజకవర్గంలోని మిగతా మునిసిపాలిటీల పట్ల తగిన శ్రద్ధ వహించలేదని, తగిన సూచనలు చేయలేదని సహకరించలేదని కార్యకర్తలకు కూడా ఆగ్రహంతో రగిలిపోయారు.

▪ **నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు ఒక్క మునిసిపాలిటీ కూడా బిజెపికి దక్కకపోవడం పట్ల నిజమైన బిజెపి కార్యకర్తల్లో ఆవేశం రగిలింది. ఆ ఆవేశం మొత్తం జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు యాదగిరి పై విరుచుకుపడింది**

బిజెపి జగిత్యాల జిల్లా అధ్యక్షుని ఎన్నిక జరిగినప్పటి నుంచి యాదగిరి వ్యక్తిగత స్థాయి పట్ల కార్యకర్తల్లో ప్రజల్లో పెదవి విరుపు ఉంది. బిజెపి జిల్లా అధ్యక్షుడిగా యాదగిరికి తగిన స్థాయి లేదని బిజెపితో పాటు ప్రజల్లో కూడా బలమైన అభిప్రాయం ఉన్నది.
బిజెపి పార్టీలో సీనియర్ కార్యకర్తలు ఎవరు తనకు అవసరం లేదని, తన మాట వినే వాళ్లే నిజమైన బిజెపి కార్యకర్తలని ఎంపీ గారు కూడా భావిస్తున్నట్లు ఉందని ఎంపీ గారి ప్రకటనలు తెలియజేస్తున్నాయని బిజెపి కార్యకర్తలు భావిస్తున్నారు. ఏదేమైనా కేంద్రంలో బిజెపి ప్రాభవం, ప్రధాని మోడీ పట్ల ఉన్న ప్రజాదరణ, హిందుత్వ ప్రభావం స్థానిక సంస్థల్లో పనికి రాకుండా పోయిందని బిజెపి కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా భావిస్తున్నారు.

▪ **పార్టీ కార్యకర్తలా కాదా! అన్నది ముఖ్యం కాదని, తన అనుచరులు, విశ్వసనీయులు అవునా కాదా అన్నదే ముఖ్యమని ఎంపీ అరవింద్ గారు భావిస్తున్నారని కార్యకర్తల్లో వినిపిస్తున్న అభిప్రాయం.**

బిజెపి ప్రహసనం ప్రత్యర్థి పార్టీలకు ఒక విమర్శ సరుకగా మారింది. అంతేకాదు కార్యకర్తల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్న ఎంపీ అరవింద్ గారి వ్యవహార శైలి పట్ల ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

▪ **పార్టీలో కోవర్టులు ఉన్నారని వారందరినీ బయటకు పంపడం తక్షణ కర్తవ్యం అని బహిరంగంగా మీడియాతో మాట్లాడిన ఎంపి అరవింద్ గారు కూడా కాంగ్రెస్ పార్టీ కోవర్టుగా మారినారని పేర్లు వెల్లడించడానికి ఇష్టపడని బిజెపి కార్యకర్తలు నాయకులు ప్రతి విమర్శలు చేస్తున్నారు**

నిజామాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఒక్క మునిసిపాలిటీని కూడా దక్కించుకోకపోవడం, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను చేజార్చుకోవడము ఏమిటని సీనియర్ కార్యకర్తలు గొంతు విప్పుతున్నారు.
ఎంపీ అరవింద్ గారికి వ్యతిరేకంగా మాట్లాడినా, తమ అభిప్రాయము నిక్కచ్చిగా చెప్పినా పార్టీలో మనుగడ కష్టమనే భయం కార్యకర్తల్లో నెలకొంది.

▪ **జగిత్యాల మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి గారి రాజకీయ స్థితి పట్ల బాధపడ్డ శ్రీ అరవింద్ గారు ఇప్పుడు పార్లమెంటు నియోజకవర్గం లోని పార్టీ పరిస్థితి పట్ల బాధపడే సమయం వచ్చిందని ప్రజలు కార్యకర్తలు భావిస్తున్నారు**

బోధన్ నుండి జగిత్యాల వరకు దశాబ్దాలుగా అంకితమై పని చేసిన అసంఖ్యాక పార్టీ కార్యకర్తలు తమ భవిష్యత్తు గురించి, పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచించి తలలు పట్టుకుంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉందని, ఈ లోపున పార్టీ వ్యవస్థాగత నిర్మాణాన్ని బలంగా మార్చకపోతే లోపాలు సవరించుకోకపోతే హిందుత్వము, జాతీయత, మోడీ కూడా పార్టీని కాపాడలేరని బిజెపి కార్యకర్తలు అభిమానులు భావిస్తున్నారు.

## మెట్‌పల్లి మున్సిపల్ ఛైర్మెన్ గా లింబాద్రి

**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఛైర్మెన్ ఎన్నికల్లో మైలారం లింబాద్రి ఛైర్మెన్‌గా, 1 వ ఓంకారీ నవీన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలు కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ ఇక్కడ పట్టు కోల్పోయినట్లు స్పష్టం చేశాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## కోరుట్ల మున్సిపాలిటిలో కార్యకర్తకు పట్టం

● చైర్ పర్సన్ గా శ్రీమతి తిరుమల వసంత గంగాధర్ ఎన్నిక



**కరపత్రం ప్రతినిధి కోరుట్ల**
ఎన్నో ఊహాగానాల మధ్య ఎన్నో అంచనాల మధ్య నిన్న కోరుట్ల మునిసిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నిక జరిగింది. చైర్మన్ గా పదవిని ఆశించిన ప్రముఖులను కాదని పార్టీకి అంకితమై పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా పనిచేస్తున్న కోరుట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీ తిరుమల గంగాధర్ సతీమణి శ్రీమతి వసంతను మునిసిపల్ చైర్ పర్సన్ గా ఎన్నుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ ఒడిదుడుకులు ఎన్ని వచ్చినా, ఇతర పార్టీల నాయకులు ఎన్ని ప్రలోభాలు చూపిన చలించకుండా కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేసిన శ్రీమతి తిరుమల వసంత గంగాధరను చైర్ పర్సన్ గా ఎన్నుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ జువ్వాడి నరసింగరావు గారికి మరియు పార్టీ అధిష్టానానికి సహకరించిన తోటి కార్యకర్తలకు శ్రీమతి వసంత గారు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం
## - చైర్ పర్సన్ గా కంఠం శిరీష

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని ఆమె హామీ ఇచ్చారు. తమకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ఆమె పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా ఎల్లప్పుడూ కృషి చేస్తానని శిరీష తెలిపారు.



## ఈటెల రాజేందర్ ను కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
గతంలో ఒకే పార్టీలో కలిసి పనిచేసిన ఇద్దరు నాయకులు కలుసుకోవడం రాజకీయ సామరస్యతకు ప్రతీకగా నిలిచింది.
మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గారు బిఆర్ఎస్ పార్టీలో లో ఉన్నారు. గతంలో టిఆర్ఎస్ ఉరఫ్ బి ఆర్ ఎస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఈటెల రాజేందర్ గారు ఇప్పుడు బిజెపి నాయకుడు. తాజాగా నిన్న జరిగిన మునిసిపల్ చైర్మన్ ల ఎన్నికల గురించి మల్లారెడ్డి గారు ఈటెల రాజేందర్ ఇంటికి వెళ్లి కలుసుకొని పరస్పర రాజకీయ సహకారం గురించి చర్చించుకున్నారు. మునిసిపల్ ఎన్నికల పోలింగ్ తర్వాత మేడ్చల్ నియోజకవర్గం లో రాజకీయ పరిణామాలు వేడెక్కాయి. మేడ్చల్ నియోజకవర్గం లోని మూడు మునిసిపాలిటీలు ఎంపీ ఈటెల రాజేందర్ గారి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోనికి వస్తాయి.



కొత్తగా ఏర్పడిన ఎల్లంపేట, మూడు చింతలపల్లి మరియు అలియాబాద్ మునిసిపాలిటీలలో చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ల ఎన్నికల గురించి గురించి వ్యూహ రచనలు జరిగాయి.
ఇదే విషయమై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మల్లారెడ్డి, ఈటెల రాజేందర్ ను కోరినట్లు సమాచారం.
ప్రజా పాలనకు ఎలాంటి అడ్డంకులు అవరోధాలు ఉండకూడదనే ఉద్దేశంతో ఈటల రాజేందర్ గారు మల్లారెడ్డి గారి ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారు.
ఇరువురు నాయకుల భేటీ తరువాత ఈ మునిసిపాలిటీలలో చైర్మన్ల మున్సిపల్ చైర్మన్ ల ఎన్నిక సాఫీగా జరిగింది. రాజకీయ పట్టుదలకు పోకుండా ప్రజాపాలన కుంటు పడకుండా పాలకవర్గాలు సాఫీగా ఏర్పడాలని పాలన సులువుగా అందాలని ఈటెల రాజేందర్ గారు ఆకాంక్షించారని సమాచారం. ఎలాంటి భేషజాలు లేకుండా మల్లారెడ్డి గారు ఈటెల రాజేందర్ గారి ఇంటికి వెళ్లడం రాజకీయ భావాన్ని పెంపొందించిందని ప్రజలు భావిస్తున్నారు. నిన్నటి మున్సిపల్ పాలకవర్గ ఎన్నికల్లో ఎల్లంపేట మరియు మూడు చింతలపల్లి మున్సిపాలిటీలను కారు పార్టీ స్వాధీనం చేసుకుంది. అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ తన "హస్త" గతం చేసుకుంది.

## ఎమ్మెల్యే నేతృత్వంలో రామగుండాన్నీ బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తాం

» నగర మేయర్ మహంకాళి స్వామి

**కరపత్రం ప్రతినిధిం గోదావరిఖని ఫిబ్రవరి 16:**
రామగుండం శాసన సభ్యులు ఎశీ.ఎస్. రాజ్ ఠాకూర్ నేతృత్వంలో రామగుండం నగరాన్ని ఇంకా బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని కొత్తగా ఎన్నికైన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉంటూ మూడు సార్లు కార్పొరేటర్ గా గెలిచి పార్టీకి విధేయుడుగా ఉన్నానని అన్నారు. ఎమ్మెల్యే ఎశీఎస్. రాజ్ ఠాకూర్, వారి సతీమణి మనాలీ రాజ్ ఠాకూర్ తనను కుటుంబ సభ్యుడిగా భావించి ఆశీర్వదించడంతో పాటు, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రాజకీయంగా ఎదిగి మేయర్ పదవి చేపట్టగలిగానని అన్నారు . కష్ట పడి పని చేసే వారికి



కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు. దేశ విదేశాల్లోని నగరాలతో పోటీ పడే విధంగా, మెట్రో నగరాలకు ధీటుగా రామగుండం నగరాన్ని అభివృద్ధి చేయాలని ఎంఎల్ఎ కంకణం కట్టుకున్నారని అన్నారు. ఈ ప్రయత్నంలో తాము భాగస్వాములమవుతామని అన్నారు. తాను మేయర్ గా ఎన్నిక కావడానికి సహకరించిన కార్పొరేటర్లకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో మురికివాడల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. నగరంలో అన్ని ప్రాంతాలకు రక్షిత మంచి నీటి



సరఫరా, రోడ్లు, మురుగు నీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ అందుబాటులోకి తెచ్చే విధంగా పని చేస్తామని అన్నారు. తమ పని తీరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తామని అన్నారు.

**నగర అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది..**
**- డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య**
ప్రగతి పథంలో ముందుకు దూసుకు వెళుతున్న రామగుండం నగర అభివృద్ధిలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య అన్నారు. సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో డిప్యూటీ మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో ఉండి చేసిన సేవలను, అనుభవాన్ని ఎంఎల్ఎ గుర్తించి ఎంతో నమ్మకం తో తనకు ఈ పదవి అప్పగించారని అన్నారు. పార్టీకి కట్టుబడి విధేయతతో పని చేసి ఆయన నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి ఆధ్వర్యంలో రామగుండం నగరాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. తాను డిప్యూటీ మేయర్ కావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
12

# వెళ్ళొస్తాం భీమన్న..



» చల్లగా బతికితే మళ్ళోస్తాం..
» భీమన్నకు భక్తుల మొక్కులు
» స్వస్థలాలకు బయలుదేరిన భక్తులు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వర స్వామిని మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు దర్శించుకుని తరించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సమేతంగా ఆనందభరితంగా ముల్లె మూటలు పిల్లాపాపలతో వెనుదిరిగారు. దర్శనం ముగించుకుని బయలుదేరే సమయంలో "మల్లొస్తాం రాజన్న" అంటూ స్వామివారిని మరోసారి దర్శించుకోవాలని మనసులో కోరికతో స్వస్థలాలకు తిరుగు ప్రయాణం అయ్యారు.

### భక్తుల జాగరణ

మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయ ఆవరణతోపాటు, పార్కింగ్ స్థలంలో భక్తుల జాగరణ ఘనంగా కొనసాగింది. రాత్రంతా భక్తులు స్వామివారి నామస్మరణలో మునిగిపోయి భజనలు, కీర్తనలు చేస్తూ జాగరణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా ఓంకార నాదంతో మార్మోగగా, శివ భక్తుల భక్తి భావం ప్రత్యేకంగా కనిపించింది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు నిర్వహిస్తూ భక్తులు రాత్రంతా నిద్ర మానుకుని శివుని కటాక్షం కోసం ప్రార్ధనలు చేశారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న భక్తులు జాగరణలో పాల్గొని, శివనామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. "ఓం నమః శివాయ" నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగుతూ, శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగాయి.

### భక్తుల మొక్కులు

భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనంలో నైవేద్యం వండి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నగరేశ్వర ఆలయాన్ని సైతం సందర్శించారు.

### నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి దర్శనం

శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నాంపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ సోమవారం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న వారు మొక్కులు చెల్లించుకుని స్వామివారి కటాక్షం కోసం ప్రార్థించారు. దేవాలయ ప్రాంగణం భక్తి నినాదాలతో మార్మోగగా, భక్తులు



క్రమబద్ధంగా క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శనం పొందారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి ఆశీస్సులతో సంతోషంగా వెనుదిరిగారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తుల సందడి ప్రత్యేకంగా కనిపించింది.

### తాత్కాలిక బస్టాండ్

మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆధ్వర్యంలో జగిత్యాల రోడ్ లో ఇండియన్ గ్యాస్ గోదాం ముందు తాత్కాలిక బస్టాండ్ ను ఏర్పాటు చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, మెట్ పల్లి, కోరుట్ల తదితర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కొరకు తాత్కాలిక పందిళ్లతో బస్టాండ్ ను నెలకొల్పారు. భీమన్నను దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో తాత్కాలిక బస్టాండులో బస్సు ఎక్కి వారి స్వస్థలాలకు ప్రయాణం మొదలుపెట్టారు.

### 5000 మంది ఉద్యోగులతో జాతర నిర్వహణ

భీమేశ్వర స్వామి సన్నిధిలో జరిగిన మహాశివరాత్రి జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్ 5000 మంది వివిధ శాఖల ఉద్యోగులతో జాతరను సక్సెస్ చేశారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్డబీ తదితర శాఖలకు చెందిన సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రద్దీ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు, సమాచార కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

### పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ

జాతర సందర్భంగా పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, తాత్కాలిక వసతి గృహాల వద్ద శుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. చెత్త సేకరణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం మురుగును తొలగించే చర్యలు తీసుకున్నారు. తాగునీటి సదుపాయాలు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడి, ఫినాయిల్ పిచికారీ నిర్వహించారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు పారిశుధ్య విభాగం సిబ్బంది అహర్నిశలు కృషి చేశారు.

### పోలీసుల పటిష్ట భద్రత

జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆధ్వర్యంలో పోలీస్ శాఖ భద్రతా చర్యలు చేపట్టింది. ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, జాతర ప్రాంగణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.
ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేలా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులపై సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని అణువణువు పరిశీలించారు. జాతర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ అధికారులు పహారా కాస్తూ, భక్తులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర పోలీస్ నిఘాలో జరిగింది.

# ప్రజలు మాకు పాస్ మార్కులు ఇచ్చారు

» 10 ఏళ్లలో లేని అభివృద్ధి రెండేళ్లలో చూపించాం
» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
» చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని ప్రజలు మాకు పాస్ మార్కులు ఇచ్చారని, పదేళ్లలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆది పాల్గొన్నారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ ఎన్నిక అనంతరం భీమేశ్వర స్వామిని పాలకవర్గ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏకైక కౌన్సిలర్ నుండి నేడు మున్సిపల్ పీఠం కైవశం చేసుకున్నామని, గత ప్రభుత్వం చేయని పనులు మేము రెండు



సంవత్సరాలలో పూర్తి చేసిన పనుల గురించి చెప్తూ ఓటు అడిగామని, పట్టణ ప్రజలు మేము చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మాకు పట్టం కట్టారని, మాపై ఇంకా బాధ్యత పెరిగిందని, ఎన్నికల్లో మా అభ్యర్థులు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని అన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో



అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి దిశగా ముందుకు పోతామని, మమ్మల్ని ఆశీర్వదించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### పట్టణంలో ర్యాలీ

మున్సిపల్ లో చైర్మన్ గా వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గెలుపొందిన కౌన్సిలర్లతో ఓపెన్ టాప్ జీప్ పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పురవీధుల గుండా ప్రజలకు అభివాదం చేస్తూ, కార్యకర్తల నినాదాల మధ్య ర్యాలీ నిర్వహించారు.

## రామగుండం మేయర్/డిప్యూటీ మేయర్ ఎన్నికకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 16:**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్‌లు కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఎన్నికల



ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.
ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లో కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
ఈ బందోబస్తులో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొనా

# రామగుండం కార్పొరేషన్ మేయర్ గా స్వామి, డిప్యూటీ మేయర్ గా ఎల్లయ్య

» 60 మందిలో 49 మంది హాజరు
» అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల కార్పొరేటర్లు దృష్టి సారించాలి
» ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్


**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 16:**
నూతనంగా ఎన్నికైన డివిజన్ సభ్యుల ప్రమాణ స్వీకారం కొరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 60 మంది సభ్యుల్లో సమావేశానికి హాజరైన 49 మంది వార్డు సభ్యులచే ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన జిల్లా పరిషత్ సిఇఓ నరేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన 10వ వార్డు సభ్యులు అడ్డాల గట్టయ్య, 40వ డివిజన్ కార్పొరేటర్ కజంపురం జయప్రద తప్ప మిగిలిన 11 మంది వార్డు సభ్యులు హాజరు కాలేదు. తెలుగు అక్షరమాల ప్రకారం 10వ డివిజన్ కార్పొరేటర్ అడ్డాల గట్టయ్య మొదట ప్రమాణం చేయగా ఆఖరున 17వ డివిజన్ అనుము స్వరూప ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 46వ డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి పేరును 9వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ళపెల్లి యుగంధర్ ప్రతిపాదించగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము బలపరిచారు. మరో ప్రతిపాదన రాకపోవడంతో మేయర్ పదవికి మహంకాళి స్వామి ఎన్నికైనట్టుగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఆ తరువాత డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రారంభమైంది. డిప్యూటీ మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 57వ డివిజన్ కార్పొరేటర్ పాతపెల్లి ఎల్లయ్య పేరును 30వ





డివిజన్ కార్పొరేటర్ ఇసంపల్లి అంజయ్య ప్రతిపాదించగా 31వ డివిజన్ కార్పొరేటర్ షాహెదా బలపరిచారు. మరో ప్రతిపాదన రాకపోవడంతో డిప్యూటీ మేయర్ గా పాతపెల్లి ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఈ సమావేశంలో రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు, నగర పాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ, ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా నూతన పాలక వర్గం పని చేయాలని రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు, నగర పాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ సూచించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో సోమవారం నిర్వహించిన మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల కార్పొరేటర్లు దృష్టి సారించాలని అన్నారు. పార్టీ విధేయత, సీనియారిటీ, అనుభవం ప్రాతిపదికన మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు అభ్యర్థులను అధిష్టానం ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. నిఖార్సయిన ప్రజా సేవకులు దొరికారని అన్నారు. పరిపాలనా సౌలభ్యం కొరకు జోన్లుగా విభజించుకోవడం తప్పా ఎయిట్ ఇంక్ లైన్ కాలనీ, గోదావరిఖని, ఎన్టిపిసి, రామగుండం వేర్వేరు ప్రాంతాలు కాదని రామగుండం నగర పాలక సంస్థ పరిధి అంతా ఒకే ప్రాంతమని అన్నారు. పాలన ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం 50 డివిజన్ ల నుండి 60 డివిజన్ లకు పెంచడం జరిగిందని అన్నారు. ఐకమత్యంతో పార్టీలకతీతంగా అన్ని డివిజన్ లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ పాలక వర్గం పని చేస్తుందని అన్నారు. రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి విషయంలో ప్రజలు నిజం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు స్మార్ట్ జిల్లాగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో పూర్తి సహకారం అందజేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మన రామగుండం నగరాన్ని వైద్య , విద్య, వ్యాపార, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుకుందామని అన్నారు. అధికారులు, సిబ్బందితో ప్రేమగా వ్యవహరిస్తూ పనులు పూర్తి చేసుకోవాలని నూతన సభ్యులకు సూచించారు.

## స్కూల్ బస్సును ఢీకొన్న లారీ- విద్యార్థులకు స్వల్ప గాయాలు:



**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి ;**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బస్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న స్కూల్ బస్సును హుస్నాబాద్ వైపు నుండి వస్తున్న లారీ సోమవారం ఉదయం ఢీ కొట్టింది . ఈ ప్రమాదంలో స్కూల్ బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. బస్సులో ఉన్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకొని విచారణ చేపట్టారు.రోడ్డు విస్తరణ పనుల జాప్యం చేయడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రమాదాలు జరగకుండా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## భీమదేవరపల్లి గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి:**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల గ్రంథాలయానికి సిద్ధిపేట వాస్తవ్యులు సాయితీవేత్త గరిపెల్లి అశోక్ పుస్తకాలు అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. తెలుగు సాహిత్యం, కథలు, నవలలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయానికి ఇవ్వడంతో గ్రామస్తులు వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, అనంతల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.